క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై హర్షం



నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్

పెదపాడు: నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లోఓల్టేజీ సమస్య తీరనున్నట్లు పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంట గ్రామ పంచాయతీ శివారు వెంకటాపురంలో ఇటీవల ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారని తెలిపారు. విద్యుత్ సమస్యలు లేకుండా 63 కేవీ విద్యుత్ టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసామని చెప్పారు. ఆర్వో వాటర్ ప్లాంటు పూర్తవుతోందని రాజశేఖర్ హామీ ఇచ్చారు.

కళ్లజోళ్ల పంపిణీ

గణపవరం: వైఎస్సార్ కంటివెలుగు పథకంలో విద్యార్థులకు ఉచిత వైద్యంతో పాటు కళ్లజోళ్లు ప్రభుత్వం అందిస్తుందని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. శుక్రవారం గణపవరం బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో పరీక్షలుచేసి 55 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కంటి ఆరోగ్యానికి ఎక్కువగా ఆకుకూరలు, విటమిన్ ఏ కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, పాఠశాల హెచ్‌ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవద్దు

పెదవేగి : అభివృద్ధిని అడ్డుకోవడం దుర్మార్గమని జగన్నాథపురం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పెదవేగి మండలం జానంపేట నుంచి జగన్నాథపురం మీదుగా ఏడవ మైలు వరకు రూ.4 కోట్ల నిధులతో స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చొరవతో సర్వాంగ సుందరంగా రహదారి నిర్మించారు. జగన్నాథపురంలో కొంతమంది టీడీపీ నేతలు స్వార్థపూరిత రాజకీయాలతో రోడ్డును పాడుచేయాలనే ఉద్దేశంతో, మురుగు నీటిని రోడ్డుపై వదిలేస్తున్నారు. డ్రెయిన్ల నిర్మాణానికి సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు కృషి చేస్తుంటే వాటిని అడ్డుకుంటూ అభివృద్ధికి ఆటంకం కల్గిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలోని టీడీపీ నేతలు సుగసాని సత్యనారాయణ, సుగసాని నరశింహరావు, పర్వతనేని శంకరం ఈ తరహా దుర్చర్యకు పాల్పడి రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారిని పాడు చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ



పోతునూరులో జగనన్న విద్యాకానుక అందజేస్తున్న ఎంపీపీ సుమలత తదితరులు

ఉంగుటూరు: జగనన్న విద్యాకానుకను తల్లాపురం సర్పంచి పసుపులేటి నర్సింహరావు శుక్రవారం పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలను పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వై నర్సింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సర్పంచి పసుపులేటి నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

పోతునూరు పాఠశాలలో..

దెందులూరు: జగనన్న విద్యాకానుక విద్యార్థులందరికీ వరమని దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అన్నారు. శుక్రవారం పోతునూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు వైఎస్సార్ సీపీ నాయకులు బత్రాజు సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు.

ప్రభుత్వ లక్ష్యం.. పేదలకు మెరుగైన విద్య



వట్లూరులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



పోలసానిపల్లిలో ఉత్తమ విద్యార్థినులను సత్కరిస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా

పెదపాడు: రాష్ట్రంలో విద్యారంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం ద్వారా పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన ముగ్గురు విద్యార్థులను చైర్‌పర్సన్ సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ విద్యారంగంలో జగనన్న విప్లవాత్మక పథకాల కారణంగా స్కూళ్లు నేడు విద్యార్థులతో కళకళలాడుతున్నాయని చెప్పారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు స్కూల్‌కు అవసరమైన ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్యం పైనే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రణాళికాబద్ధంగా నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని చెప్పారు. వట్లూరుకు చెందిన పసుపులేటి గాయత్రి 590 మార్కులతో జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ బాలికను అందరూ అభినందించారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను చైర్‌పర్సన్ ఘనంగా సన్మానించారు. వారికి నగదు బహుమతి, మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బత్తుల ఏసురాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు, వట్లూరు సర్పంచ్ రత్నకుమారి, ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

భీమడోలు: ఉత్తమ ప్రతిభ గల బాల బాలికలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా అన్నారు. పోలసానిపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన ముగ్గురు బాలికలు గోగులమూడి శరణ్య, బి.మహిమా శాంతి, జి.హన్సికలు, వారి తల్లిదండ్రులకు దుశ్శాలువాలను కప్పి ఘనంగా సత్కరించారు. ఆ బాలికలకు ప్రశంసాపత్రంతో పాటు పతకాలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ పద్మావతి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసి ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లలను చదివించుకునేందుకు ముందుకు వస్తున్నారని, తద్వారా బాలికలు ప్రతిభను చూపి చదువుల్లో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి చదువుల్లో మరింతగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

13 రెవెన్యూ గ్రామాలతో ఏలూరు రూరల్ మండలం

- జీఓ విడుదల చేసిన ప్రభుత్వం
- త్వరలో చాటపర్రులో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు
- ఫలించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృషి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో దెందులూరు నియోజకవర్గంలో ఏలూరు రూరల్ మండలానికి మహర్దశ లభించిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటనలో నాలుగేళ్లుగా జిల్లా అధికారులతో చర్చించి ముఖ్యమంత్రికి వివరించడంతో ఈ ఫలితం లభించిందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పేర్కొన్నారు. 13 రెవెన్యూ గ్రామాలుగా విభజించి ఏలూరు రూరల్ మండలంగా గుర్తించినట్టు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. పరిపాలన, అభివృద్ధికి అధికార వికేంద్రీకరణే మార్గమని నమ్మడమే కాకుండా ఆచరణలో తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా కేంద్రమైన ఏలూరు రూరల్ మండల ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉండేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. ఏలూరు రూరల్ మండలాన్ని ఏర్పాటు చేయడంతో అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆగిన ఈ పనిని ఎమ్మెల్యే ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని జిల్లా అధికారులతో చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఒప్పించడంతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలతో పాటు చక్కటి ఉపాధి లభించనుంది. ఏలూరు రూరల్ మండలానికి సంబంధించి త్వరలో చాటపర్రులో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు కానుందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో మేరకు విభజన అనంతరం ఏలూరు రూరల్ మండలంలోని గ్రామాలు, చాటపర్రు, జాలిపూడి, కాట్లంపూడి, మాదేపల్లి, మల్కాపురం, మానూరు, శ్రీపర్రు, కలకుర్రు, కోమటిలంక, గుడివాకలంక, కొక్కిరాయిలంక, పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక ఉంటాయని ఎమ్మెల్యే వివరించారు.

జగనన్న సురక్షతో సమస్యలకు చెక్



పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి నాగరాణి

పెదవేగి : జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామ స్థాయినుంచి మండలస్థాయి వరకు ప్రజల అన్ని రకాల సమస్యలకు చెక్ పెట్టడం జరుగుతుందని పెదవేగి మండల ప్రత్యేకాధికారి నాగరాణి అన్నారు. శుక్రవారం పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 23నుంచి వచ్చే నెల 23 వరకు నెల రోజుల పాటు తహసీల్దార్ ఈఓపీఆర్‌డీ ఒక బృందం, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఒక బృందంగా, ఇలా రెండు బృందాలు రోజు విడిచి రోజు అన్ని మండలస్థాయి అధికారులతో గ్రామమంతా పరిశీలిస్తారని ఆమె చెప్పారు. ప్రజలకు అందించాల్సిన పథకాలు, పెండింగ్‌లో ఉన్న పనులను తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించి అదేరోజు ఆ పథకం అందించేందుకు చర్యలు తీసుకొవడానికి, గ్రామ సభ నిర్వహిస్తారని, ఈ మేరకు ఒక ప్రణాళి కను రూపొందించినట్లు ప్రత్యేక అధికారిణి నాగరాణి తెలిపారు. అనంతరం ప్రతీ నెల మూడో శుక్రవారం మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వంతో వచ్చిన ఫిర్యాదులు, కౌలు రైతు కార్డులు, పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా అవార్డులు, జగనన్న విద్యాకానుక, హౌసింగ్, ఐసీడీఎస్, పారిశుధ్యం తదితర అంశాలను ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. సచివాలయ భవనాలు పూర్తి చేసి త్వరితగతిన ప్రారంభించాలని ఆమె సూచించారు.

అర్హులకు పథకాల లబ్ధి అందించేందుకే 'జగనన్న సురక్ష'



పథకాల అమలు తీరుపై సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఆడిట్ అధికారి ఏవీ గంగాధరరావు

భీమడోలు: ఈనెల 27 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు జరగనున్న జగనన్న సుర క్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధిని అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని భీమడోలు మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఆడిట్ అధికారి ఏవీ గంగాధరరావు అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో శుక్రవారం మండల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేకాధికారి ఏవీ గంగాధరరావు మాట్లాడుతూ మండల పరిధిలో 27 నుంచి 21వ తేదీ వరకు గ్రామ సచివాలయాల వారీగా తహసీల్దార్, ఎంపీడీవో బృందాలు పర్యటిస్తాయన్నారు. అక్కడ పథకాల కోసం అర్హులు నమోదు చేసుకున్న వివరాలను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంబంధిత అధికారులకు తెలియజేస్తారన్నారు. అర్హత గల కలిగిన వారికి పథకాలు అందకుంటే వారిని అందేలా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మండల పరిధిలోని ఇప్పటి వరకు 389 మంది కౌలు రైతులకు కార్డులను అందించామన్నారు. ఉంగుటూరు మండలం కైకరంలో ఈనెల 19న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారన్నారు. పాఠశాలల్లో పాఠశాలలు తెరిచిన నాటి నుంచి విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు. హౌసింగ్ డీఈ పి.సోమేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలో 28 హౌసింగ్ కాలనీల్లో 2086 గృహాలకు అనుమతులు రాగా ఇప్పటి వరకు 446 గృహ నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. మండలంలో 78శాతం లక్ష్యాన్ని పూర్తి చేసుకుని జిల్లాస్థాయిలో 4వ స్థానంలో నిలిచిందన్నారు. వంద రోజుల ప్రణాళికలో 57 శాతం పూర్తి చేసుకుని జిల్లాలో 8వ స్థానాన్ని సాధించిందన్నారు. గుండుగొలనులోని మెగా లేఅవుట్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.13లక్షలు, తాగునీటి వసతికి రూ.కోటి రూపాయలు మంజూరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఏఈలు డి.సత్యనారాయణ, రామారావు, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, ఏపీవో సీహెచ్ సురేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలి



భీమడోలు ఏఈ పి.రామస్వామికి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

భీమడోలు: భీమడోలు అప్పక వారి వీధి ఏరియాలో విద్యుత్ లో ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్ సమస్యలను పరిష్కరించాలని ఆ ప్రాంత వాసులు శుక్రవారం విద్యుత్ ఏఈ పి.రామస్వామికి వినతిపత్రం అందించారు. తొలుత అప్పక వారి వీధిలోని పాడైన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కొద్ది సేపు ఆందోళన చేసారు. శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురై విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. అధిక లోడు గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, తరచూగా ఇక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవుతున్నందున ఏర్పడిన విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అనంతరం వారంతా సూరప్పగూడెం విద్యుత్ ఏఈ కార్యాలయం వద్దకు వెళ్లి ఏఈ పి.రామస్వామికి విద్యుత్ సమస్యలపై వినతిపత్రం అందించారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన పాడైన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసారు. అదనంగా మరో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేసేందుకు తాము సిద్ధంగా తెలిపారు. వేసవిలో అధిక విద్యుత్ వినియోగం వద్ద విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నాయని, వాటన్నింటినీ పరిష్కరిస్తున్నామన్నారు. దీనితో స్థానికులు అక్కడి నుంచి వెళ్లారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేయాలి

పెదపాడు: ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పీ రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం పెదపాడు మండలంలోని నాయుడుగూడెం, సత్యవోలు, కొత్తూరు, సత్యనారాయణపురం తదతర గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పీ రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. మంచినీళ్లు, మజ్జిగ కూలీలే తెచ్చుకుంటున్నారని తెలిపారు. మెడికల్ కిట్లు, టెంట్లు వంటి సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల 43 డిగ్రీల ఎండలో కూడా ఉపాధి పనులు చేస్తున్నారని తెలిపారు. కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో మండల ఉపాధి సిబ్బంది వైఫల్యం చెందారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. షేక్ కరీముల్లా, సునీత,శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



పిప్పరలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

గణపవరం: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల కనీస వేతనాలు పెంచాలని, వారి సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ కార్మికసంఘ కార్యదర్శి జె.సత్యనారాయణ, సీఐటీయూ మండల కార్యదర్శి పి.గోవింద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర కొండాలమ్మ గుడివద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు చేస్తున్న చోట నీడ కల్పించాలని, వారికి మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మెడికల్ కిట్లు వంటివి అందుబాటులో ఉంచాలని కోరారు. గ్రామాల్లో వ్యవసాయానికి ముఖ్యమైన పంట, మురుగు బోదెలు ప్రక్షాళన చేస్తున్న ఉపాధి కూలీలకు గిట్టుబాటు కూలీ ఇవ్వాలన్నారు. కనీస వేతనం రోజుకు రూ.600 ప్రకటించాలని వారు కోరారు. బాబూరావు, శామ్యూల్, వెంకట్రావు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమల నివారణతో వ్యాధులకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని గణపవరం మండలం కాశిపాడు సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు జంపన పద్మావతి రమేష్‌రాజు అన్నారు. శుక్రవారం వైద్యసిబ్బందితో కలిసి గ్రామంలో మలేరియా వ్యాధిపై అవగాహన, దోమల వ్యాప్తి, నివారణ, దోమల నుంచి రక్షణ తదితర అంశాలపై ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ఇంటింటికీ వెళ్లి అపరిశుభ్రత, దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యోగ సాధనతో జ్ఞాపకశక్తి వృద్ధి



కొప్పాకలోని విద్యార్థులతో యోగాసాధన చేయిస్తున్న పీడీ దృశ్యం

పెదవేగి : ఆరోగ్యం, జ్ఞాపకశక్తి వృద్ధికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని కొప్పాక యోగా డిస్పెన్సరీ వైద్యాధికారిణి దుర్గాభవాని అన్నారు. పెదవేగి మండలం కొప్పాక ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక యోగ శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం పలు యోగ ఆసనాలపై స్థానిక పీడీ శ్రీనివాసరావు శిక్షణనిచ్చారు. అనంతరం డాక్టర్ దుర్గాభవాని మాట్లాడుతూ జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె చెప్పారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా యోగసనాలు, ధ్యానం, ప్రాణాయామం నేర్చుకోవడం వల్ల ఎంతో బావుంటుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలాల ఆక్రమణ

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన అన్ని కులాల శ్మశాన స్థలాలను రెవెన్యూ అధికారులు యుద్ధప్రాతిపదికన పరిరక్షించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోట వెంకన్న అన్నారు. శుక్రవారం గాలాయగూడెంలో ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలు ఆక్రమణకు గురవడంతో మరణానంతరం అంత్యక్రియుల కోసం గ్రామవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనిపై తహసీల్దార్లకు, స్పందన కార్యక్రమాల్లో ఇప్పటికే ఫిర్యాదులు అందాయని అన్నారు. నియోజకవర్గ ప్రజల భవిష్యత్తు అవసరాలు దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాలను పరిరక్షించాలన్నారు.

గుర్రపుడెక్క తొలగించాలి

దెందులూరు: ఏలూరు గోదావరి కాలువలో గుర్రపుడెక్కను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం దెందులూరు మండలంలోని కొవ్వలి, ఉండ్రాజవరంలో శ్రీనివాస్, రైతుసంఘ నాయకులు పర్యటించారు. ఏలూరు కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో శివారు ప్రాంత భూములకు సాగునీరందక వేసిన నారుమడులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

18న బీజేపీ సభ

ఉంగుటూరు: బీజేపీ బహిరంగ సభ ఈనెల 18న ఆదివారం ఏలూరు నగరంలోని రామకోటి గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్టు ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి వెల్లడించారు. ఈసభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, సృజనా చౌదరి పాల్గొంటారని తెలిపారు. మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, ఉంగుటూరు అసెంబ్లీ పార్టీ ఇన్‌చార్జి కాకిలేటి వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మండల అధ్యక్షుడు వంజరపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.